క్లుప్తంగా

పరామర్శ

గోపవరం : మండలంలోని రాచాయపేట గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ సుధారాణి భర్త రోశిరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసానిఆదిత్యరెడ్డి రోశిరెడ్డి స్వగ్రామమైన బిడుసుపల్లెకు వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉప సర్పంచ్ సుధారాణి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రాజారత్నం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని హౌసింగ్ లే అవుట్లలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ పీడీ రాజారత్నం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి నిర్మాణాల ప్రక్రియ వేగవంతం చేయాలని, ఇందుకు ప్రభుత్వం అందించే అదనపు సాయాన్ని ఉపయోగించుకుని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే సంబంధిత అధికారులు సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేయడంతో పాటు నిర్మాణ సామగ్రిని సకాలంలో అందించేందుకు కృషి చేయాలని కోరారు. అందుబాటులో లేని, ఇల్లు నిర్మించుకోవడానికి ఆసక్తి చూపని వారి ఇళ్లను రద్దు చేసి ఇళ్లులేని మరొకరికి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, హౌసింగ్ డీఈ ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సుకు ప్రమాదం

చింతకొమ్మదిన్నె : రాయచోటి నుంచి కడపకు వస్తూ గువ్వలచెరువు ఘాట్ పైన నాలుగో మలుపు వద్ద ఇంట్రాసిటీ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సుకు పెను ప్రమాదం తప్పింది. బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లే క్రమంలో అడ్డుగా వేసిన మట్టిదిబ్బ పైకి ఎక్కి ఆగిపోయింది. ఈ కారణంగా బస్సుకు పెను ప్రమాదం తప్పింది.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలో స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులుసహకరించాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ కోరారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై వచ్చే దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిష్కరిస్తామని రాజకీయ పార్టీల నేతలకు స్పష్టం చేశారు. జాబితాలో మృతిచెందిన వారి వివరాలను, గ్రామంలో లేని వారి వివరాలను బూత్ స్థాయి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే రాజకీయ పార్టీలచే నియమించబడిన బూత్‌స్థాయి ఏజెంట్లతో సమన్వయం చేసుకుని తొలగించాలని కోరారు. గోపవరం మండలంలోని సూరేపల్లె గ్రామంలోని 272 బూత్‌ను తొలగించాలని టీడీపీ నేతలు ఫిర్యాదు చేయగా గ్రామంలో పూర్తిస్థాయిలో విచారించి తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. సమావేశంలో గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్.వి.సాయిక్రిష్ణ, టీడీపీ నాయకుడు వెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేసుకోవాలి

సిద్దవటం : వరి నారు పోసే ప్రతి రైతు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని, తద్వారా విత్తనం భూమి ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చునని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి, బొగ్గిడివారిపల్లె, మాధవరం–2 రైతు సేవా కేంద్రాలను శుక్రవారం బద్వేల్ ఏడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ అర్హులైన రైతుల జాబితాను పరిశీలన ప్రక్రియను సమీక్షించామన్నారు. అలాగే మట్టి నమూనాలను సేకరించడం పూర్తి చేసి 24తేదీ రైతుల జాబితాతో సహా ఊటుకూరులోని భూసార పరీక్షా కేంద్రంలో సబ్మిట్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. జూలైలో పసుపు సాగు చేస్తారని, అంతకు ముందే నవధాన్యాల విత్తనాలతో పీఎండీఎస్ సాగు చేపట్టాలని తద్వారా భూసార వృద్ధి, సేంద్రియ కర్బనం శాతం పెరుగుతుందన్నారు. రైతు పొలంలో కనీసం 1 శాతం సేంద్రియ కర్బనం ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న జనుము విత్తనాలకు ఇతర పప్పు దినుసులు, నూనె గింజలు, ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు వంటి ఇతర రకాల విత్తనాలు కలిపి సాగు చేయడం రైతులు అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఖరీఫ్ 2025 ప్రణాళికపై చర్చించి తగు సూచనలు ఇచ్చారు.

ఈ ఏడాదైనా రైతులకు
భరోసా అందేనా?

- జగన్ పాలనలో ఐదేళ్లకు నియోజవర్గానికి రూ.136.41 కోట్లు
- కూటమి పాలనలో రైతు భరోసా కోసం ఎదురు చూపులు?





ఖాజీపేట : ఆరుకాలం కష్టంచి పంటలు సాగు చేసే వాడు రైతు.. అలాంటి రైతు పరిస్థితి నేడు దారుణంగా మారింది. పండించిన పంటకు సరైన గిట్టుబాటుధర లేక, అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడం, పంటలకు క్రిమీ కీటకాలతో దిగుబడి తగ్గి నష్ట పోవడం ఇలా ఎదో ఒకటి జరిగి రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. అలాంటి రైతులకు ప్రభుత్వం నుంచి కొంత మేరకు ఆర్థిక అండదండలు అందించాలన్న లక్ష్యంతో నాటి వైఎస్సార్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా పేరుతో రైతులకు ఆర్థిక అండదండలు అందించి రైతులను అదుకుంది. కానీ నేడు కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి అయినా ఖరీఫ్ సీజన్ వస్తున్న రైతులకు రైతు భరోసా వస్తుందన్న ఆశ అడిఆశలుగానే మారాయి. ఈ ఖరీఫ్‌లోనైనా రైతులకు రైతు భరోసా అందుతుందా అని రైతులు ప్రభుత్వం వైపు రైతు భరోసా కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.

జగన్ పాలనలో రూ.136.41 కోట్లు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల కష్టంను చూసి రైతులకు అండగా ఉండాలని భావించింది. అందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి రైతులకు రైతుభరోసాను అందించింది. మైదుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని రైతులకు కలపి రూ. 136.41 కోట్లు రైతులకు అందింది. అందులో మండలాల వారిగా చూస్తే బి.మఠం రూ.23.48 కోట్లు, దువ్వూరు రూ.27.78 కోట్లు, చాపాడు రూ.27.47 కోట్లు, మైదుకూరు రూ.30.96 కోట్లు, ఖాజీపేట రూ.26.72 కోట్లు రైతుల ఖాతాల్లో డబ్బు పడి రైతులకు తమ వంతుగా ప్రభుత్వం సహాయం చేసింది.

కూటమి పాలనలో రైతు భరోసా కోసం ఎదురు చూపులు

కూటమి ప్రభుత్వం ఎర్పాటు చేసి ఏడాది పూర్తి అవుతోంది. ఎన్నికల్లో రైతులకు రూ.20వేలు రైతుభరోసా రూపంలో రైతులకు ప్రతి ఎటా అందిస్తామని చెప్పారు. కానీ నేటికి ఏడాది పూర్తి అయ్యింది. రెండవ సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ మరో నెలలో రానుంది. అయినా నేటికి రైతుల ఖాతాకు ఒక్క పైసా పడలేదు. అలాగే ప్రభుత్వం ఇస్తుందన్న ఆలోచన రైతులకు భరోసా కలగడం లేదు. దీంతో రైతులు అసలు కూటమి పాలనలో రైతులకు భరోసా వస్తుందా రాదా ? అన్న ఆలోచనలో ఉన్నారు.

2024లోనూ నష్టాలే

2024లో అకాల వర్షాల కారణంగా రైతులు పంటలు సాగు చేస్తే తీవ్రంగా నష్టపోయారు. అరటి, పూలతొటలు, వరి, పసుపు, వేరుశనగ, చీనీ ఇలా చాలా మంది రైతులు నష్టాలను చవిచూశారు. పంటలు చేతికి వచ్చే సమయానికి సరైన ధరలు లేక పోవడం అలాగే, వర్షం కారణంగా పంటలు దెబ్బతినడం, పంటలకు చీడపీడల బెడద అధికమై రైతులు నష్టాలను చవిచూశారు.

వరి రైతులకు అన్యాయం

2024 ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి పంట సాగు చేసిన రైతులు చాలా వరకు నష్టపోయారు. ప్రభుత్వం గిట్టు బాటు ధరతో రైతుల నుంచి పంట కొనుగోలు చేయాలని భావించిన అధికారులు నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. మైదుకూరు నియోజకవర్గంలో ఎక్కడా రైతుల నుంచి పంటలు కొనుగోలు చేసిన దాఖలాలు లేవని రైతులు అంటున్నారు. అందుకే నష్టం వచ్చినా చాలా వరకు దెబ్బ తిన్న పంటలను బయట దళారులకు అమ్మి నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వం మాట నిలుపుకోవాలి



ఎన్నికల ముందు రైతులకు రూ.20వేలు రైతు భరోసా రూపంలో అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం ఎర్పడి ఏడాది పూర్తి కావస్తోంది. రైతులకు ఒక్క పైసా నేటికి ఇవ్వలేదు. హామీ ఇచ్చిన ట్లుగా రూ. 20వేలు రైతులకు అందించి మాట నిలుపుకోవాలి.

– పీపీ రాఘవరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ

రైతులకు అండగా నిలిచిన వ్యక్తి జగన్



రైతుల కష్టం తెలిసిన నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్. అందుకే ప్రభుత్వం ఎర్పడిన ఏడాది నుంచే రైతులకు రైతు బరోసా ఇచ్చారు. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క ఖాజీపేట మండలానికే రూ. 26.72 కోట్లు ఇచ్చారు. రైతులకు అండగా నిలిచారు. నేడు రైతులు కూటమిపాలనలో భరోసా కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

– మురళీమోహన్‌రెడ్డి, ఖాజీపేట మండల కన్వీనర్

మైదుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఐదు సంవత్సరాల్లో రైతులకు అందించిన రైతు భరోసా వివరాలు

మండలం	లబ్ధిదారులు	2020	2021	2022	2023	2024
బి.మఠం	5576	రూ4.18 కోట్లు	రూ 4.86 కోట్లు	రూ4.69 కోట్లు	రూ5.22 కోట్లు	రూ 4.53 కోట్లు
దువ్వూరు	6980	రూ5.24 కోట్లు	రూ 6.10 కోట్లు	రూ 5.97 కోట్లు	రూ 5.54 కోట్లు	రూ 4.93 కోట్లు
చాపాడు	6028	రూ 4.52 కోట్లు	రూ 5.73 కోట్లు	రూ 5.44 కోట్లు	రూ 5.97 కోట్లు	రూ 6.30 కోట్లు
మైదుకూరు	8973	రూ 6.73 కోట్లు	రూ 6.45 కోట్లు	రూ 6.30 కోట్లు	రూ 5.67 కోట్లు	రూ 5.81 కోట్లు
ఖాజీపేట	6823	రూ 5.12 కోట్లు	రూ 5.48 కోట్లు	రూ 5.48 కోట్లు	రూ 5.50 కోట్లు	రూ 5.14 కోట్లు

కేసులు పెట్టి భయపెట్టలేరు



రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : కాంగ్రెస్ అధినేత్రి సోనియా, తెలుగుదేశం పార్టీ కలసి 27 కేసులు పెట్టి 16 నెలలు జైలులో పెట్టినా భయపడని మాజీ సీఎం వైఎస్ జగన్ నేడు లేని మద్యం కేసుల్లో భయపడుతున్నారని టీడీపీ నాయకులు చెప్పడం హస్యాస్పదంగా ఉందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టు గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయని వాటని బయటకు తీసేకొద్ది జగన్‌లో భయం పెరిగిందని ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్, లిక్కర్ మాఫియా కేసులో జగన్‌కు భయం పట్టుకుందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా మాట్లాడటం హస్యాస్పదంగా ఉందన్నారు. లేని కేసులో జగన్‌ను జైలుకు పంపాలని కూటమి నేతలు ఆలోచించడం వారి దివాళాకోరుతనానికి నిదర్శం అన్నారు. మాజీ సీఎం జగన్ పాలనలో బెల్ట్‌షాపులను రద్దు చేసి మద్యం షాపులను ప్రభుత్వమే నడిపిందన్నారు. నేడు కూటమి పాలనలో వీధికొక బెల్ట్‌షాపులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిందన్నారు. అలాంటప్పుడు మద్యం పాలసీలో అక్రమాలు కూటమి పాలనలో జరిగిందా లేక జగన్ పాలనలో జరిగిందా అన్నది ప్రజలు గమనిస్తున్నారని ప్రజలు సరైన సమయంలో కూటమి ప్రభుత్వంకు తగిన బుద్ది చెబుతారన్నారు. జగన్ పాలనలో బెల్ట్‌షాపులు రద్దు చేసి మద్యం అక్రమాలు నియంత్రిస్తే అక్రమాలు జరిగాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

ఈ వీధిలో వెళ్లేదెలా..!



చాపాడులోని ముస్లీం ప్రధాన వీధిలో నిలిచిన నీరు



నీటిలో ఎలా వెళ్లాలని వాపోతున్న స్థానికులు

చాపాడు : స్థానిక ముస్లీం కాలనీ వాసులు ఐదు రోజులుగా వీధిలో నిలిచిన వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ప్రధాన వీధి నీటి మడుగులా మారింది. గతంలో ఈ కాలనీ పక్కనే ఉన్న పంట కాలువలో వర్షపు నీరు వెళ్లేది. ఈ పంట కాలువను పూడ్చివేయడంతో వర్షం పడిన ప్రతిసారి వర్షపు నీరు రోజుల తరబడి వీధిలో నిలిచి ఉంటోంది. దీని ద్వారా దుర్వాసనలు రావడంతో పాటు దోమల వ్యాప్తి అధికమవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, పన్ను వసూళ్లకైతే ప్రతి రోజూ పంచాయతీ కార్యదర్శి వస్తారని మా సమస్యకు మాత్రం పరిష్కారం చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి నిల్వ లేకుండా చేయాలని లేకుంటే జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు.

ఒరిగిన సెంట్రల్ లైటింగ్ స్తంభం



ధ్వంసమైన స్తంభం దిమ్మె



కూలేందుకు సిద్ధంగా ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభం

బద్వేలు అర్బన్ : ఒరిగిన సెంట్రల్ లైటింగ్ స్తంభం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏ క్షణాన స్తంభం పడి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు చెందుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బద్వేలు – నెల్లూరు జాతీయ రహదారిలోని మడకలవారిపల్లె ఎస్సీ కాలనీ సమీపంలో డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. స్తంభం ఒరిగిపోయి దాదాపు నెల రోజులు కావొస్తున్నా మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి స్తంభాన్ని సరి చేయాలని కోరుతున్నారు.

డ్రైనేజీలో అడుగెట్టాల్సిందే



గేటు ముందు ధ్వంసమైన పలకలు

పోరుమామిళ్ల : పట్టణ నడిబోడ్డున ప్రధాన రహదారిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల గేటు ముందు డ్రైనేజీపై ఉన్న సిమెంట్ పలకలు కూలిపోవడంతో ఇబ్బంది ఏర్పడింది. ఇటీవల కళాశాలలో పనులకు వాహనాలు తిరగడంతో డ్రైనేజీపై వేసిన సిమెంట్ పలకలు విరిగిపోయాయి. వానలతో అక్కడ దారి ఛిన్నాభిన్నమయ్యి కళాశాల లోపలకు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. మైదానంలో వాకింగ్‌కు వెళ్లేవారు, తైక్వాండో విద్యార్థులు, క్రీడాకారులు నిత్యం కళాశాలలోకి వెళ్లాల్సి రావడంతో వారంతా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బైకుల్లో లోపలకు వెళ్లే ప్రయత్నం చేసి ఇద్దరు కిందపడ్డారు. కళాశాల యాజమాన్యం దీన్ని పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కాలేజీ గేటు ముందు బండరాళ్లతో లేదా సిమెంట్‌తో బ్రిడ్జి లాగా ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాల్సి అవసరం ఉంది. జిల్లా అధికారులైనా స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, వాకర్స్ కోరుతున్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతిభగల తొగటవీర క్షత్రియ విద్యార్థులు ఆదివారం లోపల ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని శ్రీ చౌడేశ్వరిదేవి తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని మున్సిపల్, జెడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి 450 పైగా మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, స్థానిక కళాశాలల్లో ఇంటర్ చదివి ప్రతిగ్రూపులో 75 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులు, ట్రిపుల్ ఐటిలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.4000, ద్వితీయ బహుమతిగా రూ,3000, తృతీయ బహుమతిగా రూ.2500 అందిస్తామన్నారు. అలాగే జేఈఈ మెయిన్స్, నీట్‌లో 5000లోపల ర్యాంక్ వచ్చిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. 2020 తరువాత పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్నామన్నారు. అర్హులైన తొగటవీర విద్యార్థులు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో తమ దరఖాస్తులను అందించాలన్నారు, అర్హులైన తొగట విద్యార్థులకు జూన్ 1న కళ్యాణ మండపంలో ప్రముఖుల చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందిస్తామన్నారు. వివరాలకు 9849203829 నంబరుకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చౌడం వెంకటరమణ, ఉపాధ్యక్షుడు ఉమ్మడిశెట్టి చౌడయ్య, బొలిశెట్టి రామయ్య, చిన్న పుల్లయ్య, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, గోవిందు, తులసీ ఈశ్వరయ్య, సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు చూపూరి బాలయ్య, సభ్యుడు కోటయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు





విశ్వనాథపురంలో బండ లాగుతున్న ప్రథమ స్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా ఎద్దు, ఆకట్టుకున్న చెక్కభజన

చాపాడు : మండలంలోని విశ్వనాథపురంలో శ్రీవీరాంజనేయస్వామి జయంతోత్సవ వేడుకలలో భాగంగా రెండు రోజులుగా జరుగుతున్న వీరాంజనేయస్వామి తిరునాల శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన బండలాగుడు, చెక్క భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నంద్యాల జిల్లా ఎద్దులకు ప్రథమ బహుమతి..

విశ్వనాథపురంలో జరిగిన బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా మిడుతూరు మండలం అలగనూరుకు చెందిన కట్టుబడి రోలి మేడంకు చెందిన ఎద్దు ప్రథమ స్థానంలో గెలుపొందాయి. ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లెకు చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దు ద్వితీయ, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కొత్తపల్లికు చెందిన జొజ్జ విద్య ఓబుళరెడ్డి, నారాయణస్వామి ఎద్దు తృతీయ, ఇదే మండలం వరదాయపల్లెకు చెందిన బెస్త శ్రీరాములు ఎద్దు నాల్గవ, చాపాడు మండలం రాజువారిపేటకు చెందిన లింగారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఎద్దు ఐదవ, వేంపల్లె మండలం గాజులపేటకు చెందిన పసుపులేటి రమణయ్య ఎద్దు ఆరవ, వల్లూరు మండలం గోసురువారిపల్లెకు చెందిన పాపిరెడ్డి వెంకటరమణారెడ్డి ఎద్దు ఏడవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు వరుసగా రూ.70 వేలు రాజువారిపేట వెన్నపూస వెంకటసుబ్బారెడ్డి, రూ.50 వేలు అల్లాడుపల్లె గోసుల మునెయ్యగారి కిషోర్‌కుమార్‌రెడ్డి, రూ.40 వేలు అయ్యవారిపల్లె పి.మునిశేఖర్‌రెడ్డి, రూ.30 వేలు విశ్వనాథపురం గ్రామస్తులు, రూ.20 వేలు నెర్రవాడ బుర్రి నాగరాజు, రూ.10 వేలు వీవీ కొట్టాలు వి.రాజశేఖర్‌రెడ్డి, రూ.5 వేలు విశ్వనాథపురం మార్తల రమణారెడ్డిలు అందజేశారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, విశ్వనాథపురం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌తో ఖాతాలను అనుసంధానించుకోండి

ప్రొద్దుటూరు కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ కావాలంటే ఆధార్‌తో ఖాతాలను అనుసంధానించుకోవాలని తపాల శాఖ ప్రొద్దుటూరు డివిజన్ సూపరింటెండెంట్ జి.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 2.83 లక్షల లబ్ధిదారులకు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్ సీడింగ్ లేకపోవడం వల్ల సంక్షేమ ఫలాలు పొందలేకున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 31 నుండి జూన్ 4వ తేదీ వరకు ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని అన్ని తపాల కార్యాలయాల్లో ఆధార్‌తో ఖాతాల అనుసంధానిస్తారని వివరించారు. ప్రొద్దుటూరు ప్రధాన తపాల కార్యాలయంలో 18 ఏళ్లు నిండి ఖాతా లేని ప్రతి లబ్ధిదారునికి కొత్త ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్ ఆధార్ అనుసంధానంతో ఓపెన్ చేస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ పంపిణీలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చాపాడు : నిత్యావసర సరకులు రేషన్ పంపిణీలో నిబంధనలు అతిక్రమిస్తే ప్రభుత్వపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దారు రమాకుమారి తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రేషన్ షాపుల డీలర్లతో నూతన పంపిణీ విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఇక నుంచి ఎండీయూ వాహనాలు గ్రామాల్లో తిరగవని గ్రామంలోని చౌకదుకాణం వద్దనే నిత్యావసర సరకులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు క్రమం తప్పకుండా రెండు పూటల సరకులను కార్డు దారులకు అందజేయాలన్నారు. తీసుకున్న సరకులకు రశీదులు ఇవ్వాలన్నారు. ప్రతి దుకాణం వద్ద సరకులు ధరల పట్టికలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు జరిగిన అవకతవకలకు పాల్పడినా ప్రభుత్వపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి నెలా ఏ సందర్భంగాలోనైనా రెవెన్యూ అధికారులు తనిఖీలు ఉంటాయని ప్రభుత్వ సూచనల మేరకూ సరకులు పంపిణీ జరపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు కృష్ణారెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.